సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 25 । జూలై । 2023



భారీగా గంజాయి పట్టివేత..

అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం, జూలూరుపాడులో పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. 8లో



జీవన ఎరువు.. కరువు !

పంటల్లో తెగుళ్లను సమగ్రంగా నివారించ గలిగే జీవన ఎరువుల తయారీ సరిపడా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
27° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురుస్తుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గోదావరి తగ్గుముఖం



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గింది. సోమవారం ఉదయం 40.6 అడుగులు ఉండగా, సాయంత్రానికి 36.8 అడుగులకు చేరింది. గోదావరి పెరిగిన వారం రోజుల తరువాత ఒక్క రోజులో సుమారు నాలుగు అడుగులు తగ్గడం ఇదే ప్రథమం. కాగా గోదావరి ఎగువన ఉన్న ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో ఏ క్షణమైనా నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అంగన్‌వాడీల డిజిటలైజేషన్‌కు ఏజెన్సీల ఎంపిక



టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్న ఏపీఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ చర్ల మండలంలోని 36 అంగన్‌వాడీ కేంద్రాల్లో డిజిటల్ పరికరాలు, ఆట వస్తువులు సమకూర్చేందుకు అర్హులైన ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన టెండర్ ప్రక్రియను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లోని అంగన్‌వాడీలను ఆధునికీకరించేందుకు డిజిటల్ పరికరాలు, ఆట వస్తువులు సరఫరా చేయాల్సి ఉంటుందని, తక్కువకు కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ భీమ్, తానాజీ, ఏసీఎంఓ రమణయ్య, చర్ల సీడీపీఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా వాయిదా

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించాల్సిన జాబ్‌మేళాను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్‌మేళా నిర్వాహకులైన హెటిరో డ్రగ్స్ ప్రతినిధులతో చర్చించి తర్వాత తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న



శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సీహెచ్.వెంకన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం కార్యాలయ ఉద్యోగులు, అధికారులు బి.ప్రసాద్, అంజయ్య, రామ్మోహనరావు, బాలస్వామి, దేవదానం, వీరన్న, శ్రీనివాసరావు తదితరులు ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆతర్వాత ఆర్‌ఎం వెంకన్న కొత్త బస్టాండ్‌ను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు.

ఖాళీగా కారు సీటు !

భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో ‘టు - లెట్’

- గులాబీ పార్టీలో అభ్యర్థి ఎవరో తెలియని వైనం
- మిగిలిన స్థానాల్లో మాత్రం టికెట్ కోసం పోటాపోటీ
- ఎన్నికలు సమీపిస్తున్నా కనిపించని చలనం
- తెల్లం వెళ్లిపోయి ఏడు నెలలైనా ఇదే పరిస్థితి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన భద్రాచలం స్థానాన్ని కైవసం చేసుకోవాలని రాజకీయ పార్టీలు, ఇక్కడి నుంచి గెలుపొందాలని అభ్యర్థులు పోటీ పడుతుంటారు. కానీ ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అధికార బీఆర్‌ఎస్ పార్టీలో ఈ రెండూ కనిపించడం లేదని ఆ పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

అక్కడ పోటాపోటీ..

రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి ఇప్పటికే రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ముచ్చటగా మూడోసారి అధికార పీఠం తమదేనన్న ధీమా ఆ పార్టీ నేతలు, కేడర్‌లో తొణికిసలాడుతోంది. అందుకే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసేందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులు క్యూ కడుతున్నారు. సిట్టింగులుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా.. తమకు ఏ మూలనో అవకాశం రాకపోతుందా అంటూ గత రెండేళ్లుగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. సిట్టింగులను మార్చాల్సిన పరిస్థితి ఎదురైతే తామున్నామంటూ గులాబీ నేతలు బారులు దీరుతున్నారు. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు నియోజవర్గాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొంది. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా తమకే టికెట్ దక్కుతుందని సిట్టింగ్ ఎమ్మెల్యేలు ధీమాతో ఉన్నారు. కానీ భద్రాచలంలో మాత్రం వీటికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

అనూహ్యంగా వీరయ్య గెలుపు

ఒకప్పుడు రాష్ట్రంలోనే అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటిగా భద్రాచలం వెలుగొందింది. రాష్ట్ర విభజన తర్వాత వరరామచంద్రాపురం, చింతూరు, కూనవరం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిశాయి. ఆ తర్వాత జిల్లాల విభజన సమయంలో ఈ నియోజకవర్గం మరోసారి విడిపోయింది. జిల్లాలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలు ఉండగా, వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. మొదటి నుంచీ ఎస్టీలకు రిజర్వ్ చేసిన ఈ నియోజకవర్గం కమ్యూనిస్టు పార్టీలకు పెట్టని కోటగా ఉంటూ వచ్చింది. అయితే రాష్ట్ర విభజనకు ముందు ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. రాష్ట్ర, జిల్లా విభజన తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పొదెం వీరయ్య గెలుపొందారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుపై విజయం సాధించారు. పొదెం వీరయ్య గతంలో ములుగు స్థానం నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో భద్రాచలం నుంచి నామినేషన్ దాఖలు చేసి హస్తం గుర్తుపై విజయం సాధించారు. ఆయన గెలుపు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ఫలించని ప్రయత్నాలు..

ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు. ఆయన స్వస్థలం ఇదే నియోజకవర్గంలోని వెంకటాపురం మండలం. కనీసం లక్ష్మీనారాయణ తరఫున కూడా ఇక్కడ బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్న బలమైన నాయకులు లేకుండా పోయారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడంపై సరైన దృష్టి పెట్టలేదనే ఆరోపణలు స్థానిక ఎంపీపై వస్తున్నాయి. గతంలో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించి ఆమెకు కీలక బాధ్యతలు అప్పగిస్తే స్వీకరించడానికి నిరాకరించడం ఈ ఆరోపణలకు ఊతం ఇచ్చినట్టయ్యింది. పినపాక ఎమ్మెల్యే, విప్, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు గడిచిన కొన్ని నెలలుగా భద్రాచలం నుంచి కారు గుర్తుపై పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముంగిట్లోకి వచ్చినప్పటికీ ఆయన సానుకూల ఫలితం రాబట్టలేకపోయారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో నెలకొంది.

వెళ్లిపోయిన తెల్లం..

గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి ఈ ఏడాది ఆరంభం వరకు భద్రాచలం నియోజకవకర్గంలో పార్టీకి పెద్ద దిక్కుగా తెల్లం వెంకట్రావు ఉంటూ వచ్చారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఆయన ముందు నుంచీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా ఉన్నారు. ఈ ఏడాది ఆరంభంలోనే బీఆర్‌ఎస్‌పై లోపాలను ఎత్తి చూపుతూ పొంగులేటి తిరుగుబాటు జెండా ఎగురవేయగా, తెల్లం వెంకట్రావు సైతం అప్పటి నుంచి గులాబీ కండువా కప్పుకోవడం మానేశారు. ఇటీవల పొంగులేటితో పాటు ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో దాదాపు ఏడు నెలలుగా బీఆర్‌ఎస్‌కు ప్రధాన అభ్యర్థి అంటూ భద్రాచలంలో ఎవరూ లేకుండా పోయారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ ఆదేశం
- దివ్యాంగుల నుంచి మొదటి దరఖాస్తు స్వీకరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక ఆల సోమవారం ఐడీఓసీలో తొలిసారి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగుల నుంచి మొదటి దరఖాస్తు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి వినతులు సమర్పించేందుకు ఎంతో కష్టపడి వస్తారని, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు కె వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రాజుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- పినపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన లక్కి స్వరూప సీతారాంపురం రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 670/18లో తమకున్న 20 కుంటల భూమిని బీటీపీఎస్ నిర్మాణంలో కోల్పోయామని, తనకు బీటీపీఎస్‌లో ఉద్యోగ అవకాశం కల్పించాలని దరఖాస్తు చేయగా, భూసేకరణ పర్యవేక్షకులకు ఎండార్స్ చేశారు.
- లక్ష్మీదేవిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సరిగా పాఠశాలలకు హాజరు కావడం లేదని, దీంతో పిల్లలు చదువుకోలేకపోతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయగా చర్యల నిమిత్తం డీఈఓకు ఎండార్స్ చేశారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌పై సమీక్ష

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలను వాట్సాప్ ద్వారా పంపాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఈ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలలో ప్రతిభ చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. గ్రామీణ, వ్యవసాయ, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలతో పాటు విద్యార్థుల ఆవిష్కరణలకు అవకాశం ఉందని వివరించారు. రెండు నిమిషాల నిడివి గల వీడియో, ఆవిష్కర్తల వివరాలు, నాలుగు ఫొటోలు, ఆరు వాక్యాలతో 9100678543 వాట్సాప్ నంబర్‌కు ఆగస్టు 5లోగా పంపించాలని సూచించారు.

పంచాయతీ భవనాలకు భూమి కేటాయించాలి

గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి భూ కేటాయింపులు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్నింటికి భూమి కేటాయించినా నిర్మాణాలు పూర్తి కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలన్నారు. కొన్ని మండలాల్లో స్థలం అందుబాటులో లేదని చెబుతున్నారని, దీనిపై నివేదికలు అందజేయాలని సూచించారు. స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కె. వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారజల బోర్డు సీఈగా సత్యకుమార్

అశ్వాపురం: భారజల బోర్డు(ముంబై) చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా భారజల బోర్డు డైరెక్టర్, శాస్త్రవేత్త సత్యకుమార్ ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 31న భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జితేంద్ర శ్రీవాత్సవ ఉద్యోగ విరమణ చేయనుండగా ఆయన స్థానంలో సత్యకుమార్ ఆగస్టు 1న బాధ్యతలు చేపట్టనున్నారు. సత్యకుమార్ 1989లో మణుగూరు భారజల కర్మాగారంలో ప్రొడక్షన్ విభాగంలో అధికారి (ఎస్‌ఓసీ)గా చేరారు. 15 ఏళ్ల పాటు భారజల కర్మాగారంలో విధులు నిర్వర్తించి భారజల బోర్డు డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ముంబై భారజల బోర్డులో వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తించి ప్రస్తుతం భారజల బోర్డు డైరెక్టర్(కొత్త ప్రాజెక్టులు)గా విధులు నిర్వర్తిస్తూ.. బోర్డు సీఈగా పదోన్నతి పొందారు. సత్యకుమార్ పదోన్నతి పొందడం పట్ల మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే, డీజీఎంలు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సత్యకుమార్‌కు శుభాకాంక్షలు..

భారజల బోర్డు(ముంబై) చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగోన్నతి పొందిన సత్యకుమార్‌ను ముంబైలో భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడ్య కేశవరావు, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు పోతురాజు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రమేష్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రాజు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆయనను కోరారు.



సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

‘దళితబంధు’ దరఖాస్తులు షురూ..

- పది రోజులుగా స్వీకరిస్తున్న అధికారులు
- అర్హులనే ఎంపిక చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- మూడు నియోజకవర్గాల్లో 1,100 మంది చొప్పున ఎంపిక
- భద్రాచలం, ఇల్లెందు, వైరాలో జనాభా ప్రాతిపదికన..



కొత్తగూడెంరూరల్: రెండో విడత దళితబంధు పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. జిల్లాలో గత పది రోజుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని లబ్ధిదారులు ఆయా మున్సిపల్ కమిషనర్లకు, గ్రామీణ ప్రాంతాల వారు సంబంధిత ఎంపీడీఓలకు అప్లికేషన్లు అందజేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున అర్హులను ఎంపిక చేసి, ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జిల్లాలోని కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో 1,100 మంది చొప్పున, ఇల్లెందు, భద్రాచలం, వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో కొంత తక్కువగా మంజూరు చేయనున్నారు. భద్రాచలంలో మూడు, ఇల్లెందులో రెండు, వైరా నియోజకవర్గంలో జూలూరుపాడు మండలం ఒకటే జిల్లా పరిధిలో ఉండడంతో జనాభా ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేరకు వారు అర్హులైతేనే పథకం మంజూరుకు సిఫార్సు చేస్తారు. మొదటి విడత దళితబంధు పథకం అమలులో చోటుచేసుకున్న అక్రమాలు పునరావృతం కాకుండా రెండో విడతలో జాగ్రత్తలు పాటిస్తున్నారు.

కలెక్టర్లకు ఆదేశాలు..

రెండో విడత దళితబంధు పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. గతంలో పలువురు ఎమ్మెల్యేలు దళితబంధు పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వం దృష్టికి వెళ్లగా సీఎం కేసీఆర్ ఆయా ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక, ఎంపిక బాధ్యతలను కలెక్టర్లే చూడాలని ఆదేశించారు. జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను నూతన కలెక్టర్ ప్రియాంక ఆల చేపట్టనున్నారు. ఈ మేరకు ఆమె పక్కాగా ప్రణాళిక రూపొందించారని సమాచారం. అయితే ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో అర్హుల ఎంపికలో ఎమ్మెల్యేలనే భాగస్వాములు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, వారు సూచించిన అభ్యర్థులనే అధికారులు అర్హులుగా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

మొదటివిడతలో 421 మందికి లబ్ధి

మొదటివిడత దళితబంధు పథకం అమలులో జిల్లాలోని కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో 100 చొప్పున 300 మందికి పథకం అందజేయగా, భద్రాచలం, ఇల్లెందు, వైరా(జూలూరుపాడు మండలం) నియోజకవర్గాల్లో కలిపి 121 మందికి మాత్రమే ఎంపిక చేశారు.

సమాచారలోపంతో ఇక్కట్లు..

దళితబంధు రెండో విడత కోసం దరఖాస్తులు ఎలా అందజేయాలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ప్రజలకు సమాచారం అందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయానికి ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఫోన్ లిఫ్ట్ చేసేందుకు కూడా అధికారులు ఇబ్బంది పడుతున్నారని పలువురు అంటున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కొందరు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు

చుంచుపల్లి: వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ రాజు అన్నారు. సోమవారం ఐడీఓసీ సమావేశ హాలులో పట్టణ ప్రగతి కార్యక్రమాలపై మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, డీఈలు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే రెండు నెలల పాటు పారిశుద్ధ్య చర్యలు అత్యంత కీలకమని చెప్పారు. మురుగుకాల్వల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయించాలని సూచించారు. ఖాళీ స్థలాలు, మురుగు నీరు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. హరితహారంలో కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు రఘు, అంకుషావలి, స్వామి, ఉమామాహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రాజు

ప్రాజెక్టుల మరమ్మతులపై పట్టింపే లేదు..

సాగునీటి విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య

చర్ల: పాత ప్రాజెక్టుల మరమ్మతులను మరచిన ముఖ్యమంత్రి కేసీఆర్ కమీషన్ల కోసమే కొత్త ప్రాజెక్టుల పాట పాడుతున్నారని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మండలంలోని పెదమిడిసిలేరు సమీపంలో గల తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా సోమవారం ఆయన సాగునీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 1986లో నిర్మించిన తాలిపేరు ప్రాజెక్ట్ మరమ్మతులకు సీఎం నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి గిరిజనులు వద్దిపేట చెక్‌డ్యాం కోసం పోరాటం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దీని ఏర్పాటుకు అప్పటి సీఎం, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవ తీసుకున్నారని, అయితే ఆ సమయంలోనే ఆయన మరణించడంతో ఆ తర్వాత పాలకులు పట్టించుకోలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైతే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని చెప్పిన కేసీఆర్.. రెండుసార్లు అధికారంలోకి వచ్చినా దీని ఊసే పట్టించుకోలేదని విమర్శించారు. సీతమ్మసాగర్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లోని ఒక్క ఎకరాకు కూడా ఉపయోగం లేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య, పెదమిడిసిలేరు సర్పంచ్ బెండడోయిన శారదాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పొలంచ రామారావు, ప్రాజెక్ట్ ఈఈ హెచ్‌వీ రాంప్రసాద్, డీఈ జె తిరుపతి, ఏఈలు ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాలిపేరు నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కిన్నెరసాని గేట్లు ఎత్తివేత

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల నుంచి కిన్నెరసాని జలాశయానికి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టుకు సోమవారం ఉదయం 1000 క్యూసెక్కుల వరద రావడంతో నీటిమట్టం 402.70 అడుగులకు పెరిగింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేష్ తెలిపారు. నీటి విడుదలతో రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య చప్టాపై ఉధృతంగా ప్రవహించగా 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద నీరు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: మణిపూర్ ఘటనను నిరసిస్తూ కొత్తగూడెంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కంచారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ మాట్లాడుతూ మణిపూర్ వాసులకు అందరూ అండగా నిలవాల్సిన అవసరముందని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావుతో పాటు కాసాని రమేష్, సంతోష్‌సాహూ, పిట్టల రామారావు, యాసా యుగేందర్, ఎ.మనోరమ, లక్కినేని సత్యనారాయణ, ఎంఏ రజాక్, జె.శివరాంప్రసాద్, ఎస్.రమణారెడ్డి, అనుబ్రోలు రాంప్రసాద్, సింగు ఉపేందర్, మారపాక రమేష్, నల్లమల్ల ప్రతిభ, అన్నపూర్ణ, వి.రాజేశ్వరరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌మక్కడ్

క్లుప్తంగా

ప్రారంభానికి ముస్తాబైన పీఎస్

27న రాష్ట్ర హోంమంత్రి చేతుల మీదుగా..



నిర్మాణం పూర్తి చేసుకున్న పాల్వంచ రూరల్ పీఎస్ భవనం

పాల్వంచరూరల్: మూడేళ్ల క్రితం మొదలైన పాల్వంచ రూరల్ పోలీసుస్టేషన్ ఎట్టకేలకు సిద్ధమైంది. ఈ భవనాన్ని ఈనెల 27వ తేదీన రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ప్రారంభించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. పాల్వంచ పట్టణంలోని రూరల్ స్టేషన్‌ను 2016లో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి తరలించారు. అప్పటినుంచి గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంలోనే స్టేషన్ కొనసాగుతోంది. ఆ తర్వాత 2020లో రూ.2కోట్ల నిధులు మంజూరు కాగా, అప్పటి ఎస్పీ సునీల్‌దత్ శంకుస్థాపన చేశారు. ఈ మేరకు నిర్మాణ పనులు పూర్తికాగా, ప్రారంభోత్సవ తేదీ ఖరారు కావడంతో రహదారి, ఇతర పనుల్లో వేగం పెంచారు. కాగా, ఆయా పనులను సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ కార్తీక్ సోమవారం పరిశీలించారు.

కేటీఆర్ జన్మదిన కానుకగా టమాటాల పంపిణీ!



టమాటాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా అశ్వారావుపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం పేదలకు ఉచితంగా టమాటలు పంపిణీ చేశారు. కేటీఆర్ 47వ పుట్టిన రోజు కావడంతో 47 కేజీల టమాటాలను 50 మంది పేదలకు స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో నాయకులు మోటూరి మోహన్, శెట్టిపల్లి రఘురాం ఆధ్వర్యాన అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా కేజీ రూ.120 వరకు ఉండగా, వారు కృతజ్ఞతలు తెలిపారు.

బీటీపీఎస్‌లో ఐరన్ చోరీకి యత్నం

పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది



నిందితుడిని చూపిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

మణుగూరు రూరల్ : భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కొందరు వ్యక్తులు ఐరన్ చోరీకి ప్రయత్నించారు. అనుమతి లేకుండా బీటీపీఎస్ నుంచి వాహనాల ద్వారా తరలించేందుకు ప్రయత్నించగా.. ప్లాంట్ సెక్యూరిటి సిబ్బంది పట్టుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని మణుగూరు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. కాగా గతంలో కూడా బీటీపీఎస్ నుంచి ఐరన్‌ను అక్రమంగా తరలించిన ఘటనలు ఉన్నాయి.

పట్టపగలే చోరీ.. రూ.90 వేలు అపహరణ

గుండాల: పట్టపగలే చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం .. అటవీ శాఖలో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కుటుంబంతో కలిసి ప్రధాన రహదారిపై ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కాగా, సొంత పని నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి రవి సోమవారం ఇల్లెందుకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా, బీరువాలో దాచిన రూ.90 వేలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ బియ్యం నిల్వపై కేసు నమోదు

పాల్వంచ : పట్టణంలోని రెండు రైస్ మిల్లుల్లో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడంతో సివిల్ సప్లయిస్ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు. అల్లూరి సెంటర్ వద్ద గల వాసవీ, రామాంజనేయ రైస్ మిల్లుల్లో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో డీఎస్పీ వెంకటేష్, సీఐ వినయ్‌కుమార్ ఈనెల 19న తనిఖీలు చేశారు. అనంతరం తహసీల్దార్ రంగాప్రసాద్, సివిల్ సప్లై డీటీ ఎస్.కృష్ణ శాంపిళ్లు సేకరించి వాసవి మిల్లులో 150 క్వింటాళ్లు, రామాంజనేయ మిల్లులో 300 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేయగా మిల్లుల నిర్వాహకులు రవీంద్ర, సాయి సందీప్‌పై 6ఏ కేసు నమోదు చేశామని డీటీ కృష్ణ తెలిపారు. అలాగే, వారిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.12,623

పడవ నగదుకు పడిగాపులు..

- మత్స్యకారులకు అందని కూలీ డబ్బు
- గోదావరి వరదల్లో పడవలు నడిపి ఏడాదిగా నిరీక్షణ
- ఈసారి పడవలు నడపబోమంటున్న మత్స్యకారులు



గోదావరి వరదల్లో పడవలు నడుపుతున్న మత్స్యకారులు (ఫైల్)

అశ్వాపురం: గత ఏడాది జూలైలో గోదావరి వరదతో పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. వరదల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం పడవలు నడిపి ఏడాదిగా డబ్బుల కోసం నిరీక్షిస్తున్నారు మత్స్యకారులు. మండలంలోని చింతిర్యాల గ్రామానికి చెందిన మత్స్యకారులు గత ఏడాది జూలైలో గోదావరి వరదల సమయంలో ఏడు పడవలను చింతిర్యాల, ఆనందాపురం, అమెర్ధ, అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీల్లో నడిపారు. వరదలు ముంచెత్తడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలను సందర్శించడానికి వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు పడవలు ఉపయోగపడ్డాయి. చింతిర్యాల గ్రామానికి చెందిన మత్స్యకారులు ఏడు పడవల్లో పడవకు ఐదుగురు చొప్పున పనిచేశారు. ఒక్కో పడవకు రూ.34 వేల చొప్పున సుమారు రూ.2,40,000 చెల్లించాల్సి ఉంది. మండలంలోని నెల్లిపాక గ్రామానికి చెందిన మత్స్యకారులు మూడు పడవలు నడిపారు. వారికి సుమారు రూ.లక్ష చెల్లించాల్సి ఉంది. వీరంతా ఏడాదిగా డబ్బుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎంపీపీ ముత్తినేని సుజాత, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షర్ఫీయుద్దీన్.. నగదు చెల్లింపు విషయమై జిల్లా పరిషత్ సమావేశాల్లో లేవనెత్తారు. జిల్లా అధికారులను పలుమార్లు కలిసి విన్నవించారు. డీజిల్‌కు మాత్రమే డబ్బులు ఇచ్చారని, కనీసం భోజనాలకు కూడా డబ్బులు ఇవ్వలేదని, అయినా పడవలు నడిపామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు నగదు చెల్లించాలని కోరుతున్నారు.

ఈసారి నడపం..

ప్రస్తుతం గోదావరి వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని మత్స్యకారులతో తహసీల్దార్ ఎంఏ రాజు సమావేశమై పడవలు నడపాలని కోరారు. గత ఏడాది పడవలు నడిపితే ఇప్పటివరకు డబ్బులు ఇవ్వలేదని, ఇప్పుడు పడవలు నడపబోమని మండల పరిధిలోని చింతిర్యాల, నెల్లిపాకకు చెందిన మత్స్యకారులు చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి డబ్బులు వచ్చేలా చూస్తామని పడవలు నడపాలని తహసీల్దార్ మత్స్యకారులను కోరారు.

రూ.2.40 లక్షలు రావాలి..



గత ఏడాది గోదావరి వరదల సమయంలో పడవలు నడిపాం. ఏడు పడవలకు రూ.2 లక్షల 40 వేలు రావాల్సి ఉంది. అధికారులను, ప్రజాప్రతినిధులను ఏడాదిగా అడుగుతున్నాం. ఇప్పటి వరకు రూపాయి ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి పడవలకు డబ్బులు ఇవ్వాలి.

– నాగుల వెంకటరమణ, మత్స్యకారుడు, చింతిర్యాల

మళ్లీ నడపాలంటున్నారు..



గోదావరి వరదల్లో పడవలు నడిపితే గత సంవత్సరం డబ్బులు ఇంకా ఇవ్వలేదు. మళ్లీ ఇప్పుడు పడవలు నడపమంటున్నారు. పడవలకు డీజిల్ మాత్రమే పోశారు. భోజనాలకు కూడా డబ్బులు ఇవ్వలేదు. మాకు రావాల్సిన డబ్బులు ఇస్తేనే పడవలు నడుపుతాం. ప్రభుత్వం స్పందించి మా డబ్బులు ఇప్పించాలి.

– నాగుల రామకృష్ణ, మత్స్యకారుడు

ఏడాదిగా విన్నవిస్తున్నాం..



చింతిర్యాలకు చెందిన మత్స్యకారులకు గతేడాది వరదల్లో పడవలు నడిపిన డబ్బు రూ.2.40 లక్షలకు సంబంధించి ఎంపీపీ సుజాత, నేను ఏడాది కాలంగా జెడ్పీ సమావేశాల్లో, కలెక్టర్, జిల్లా అధికారులకు విన్నవించాం. గతేడాది డబ్బు చెల్లించకపోతే పడవలు నడపబోమని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలి.

– షర్ఫీయుద్దీన్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు

తలసేమియా నివారణకు చర్యలు



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

భద్రాచలంటౌన్: జిల్లాలో తలసేమియా, రక్తహీనత వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. భద్రాచలం ఏజెన్సీలో రక్తహీనతతో అనే మంది బాధపడుతున్నారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రతినిధులు సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా 20 వార్డులు, ప్రయోగశాలతో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరగా, స్పందించిన ప్రియాంక.. భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఎల్ కాంతారావు, సూర్యనారాయణ, రాజారెడ్డి, కామేశ్వరరావు, సిద్దులు, డాక్టర్ భానుప్రసాద్, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను వ్యతిరేకిస్తే ప్రతిఘటన తప్పదు



దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

టేకులపల్లి: ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతరులు చేపట్టిన ర్యాలీకి ఆదివాసీ నాయకులు మద్దతు తెలపడం తగదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జాతీయ కో కన్వీనర్ కల్తీ సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు అన్నారు. ఏజెన్సీ చట్టాలను వ్యతిరేకిస్తే ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దిష్టిబొమ్మలను సోమవారం టేకులపల్లిలో వారు దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టేకులపల్లి మండలం 5వ షెడ్యూల్ ఏజెన్సీ చట్టాలకు లోబడి ఉందని, మైదాన ప్రాంతాలకు భిన్నంగా ఇక్కడ చట్టాలు గిరిజనులకు మాత్రమే వర్తిస్తాయని తెలిపారు. గిరిజనేతరులకు ఈ ప్రాంతంలో హక్కులు లేవన్నారు. గిరిజనుల హక్కులను కాలరాయడానికి సిద్ధపడుతున్న గిరిజనేతరులను ఆదివాసీ నాయకులైన గుమ్మడి నర్సయ్య, కోరం కనకయ్య కలవడం, వారి డిమాండ్లకు మద్దతు ప్రకటించడం సరైంది కాదన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలు పెరుగుతున్నాయని, వారి మూలంగా గిరిజన చట్టాలు కుంటుపడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో గిరిజనులకు పెద్దన్నగా ఉంటూ చట్టాలను కాపాడాల్సిన వారు రాజకీయ స్వార్థం కోసం గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు.

భారీగా గంజాయి పట్టివేత..



భద్రాచలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న జాయిని భద్రాచలం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం వివరాలు వెల్లడించారు. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లోని అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద పట్టణ ఎస్ఐ మధుప్రసాద్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బొలేరో ట్రాలీ అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని ఆపి తనిఖీ చేయగా రహస్యంగా ఏర్పాటు చేసిన ట్రక్ చాంబర్‌లో 140 ప్యాకెట్ల గంజాయి లభించింది. వాహనంతో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితులను విచారించగా హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ మహమ్మద్ జాఫర్ ఖాన్, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహమ్మద్ అజాద్ అహ్మద్, ఫిరోజ్ ఖాన్‌గా తెలిసిందని పేర్కొన్నారు. బీదర్‌కు చెందిన గంజాయి వ్యాపారులు ఎస్కే నదీం, రమేష్ సూచనల మేరకు ఒడిశాలోని కలిమెలలో గుండు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, పట్టుబడిన 280 కిలోల గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేశామని ఏఎస్పీ చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.56 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టణ సీఐ నాగరాజు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడులో 30 కేజీలు..

జూలూరుపాడు: భద్రాచలం వైపు నుంచి ఖమ్మం వెళుతున్న కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాన్ని వెంబడించి జూలూరుపాడు సమీపంలో సోమవారం పట్టుకున్నారు. కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కారులో సుమారు 30 కేజీల గంజాయి లభ్యం కాగా, స్వాధీనం చేసుకున్న కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ పోటు గణేష్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒక మహిళ కూడా ఉండగా పోలీసులు వారిని విచారిస్తున్నారు. ఈ విషయమై మీడియా పోలీసులను సంప్రదించగా వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. అంతే కాక అక్కడికి వెళ్లిన విలేకరులపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఈ విషయాన్ని మీడియా సీఐ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మర్కోడులో వైద్య శిబిరం

డెంగీతో అప్రమత్తమైన సిబ్బంది



స్థానికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడులో ఒక డెంగీ కేసు నమోదు కావడంతో అప్రమత్తమైన సిబ్బంది సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆళ్లపల్లి వైద్యాధికారి రేవంత్ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఐఆర్ఎస్ పిచికారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం డెంగీ బాధితుడి ఇంటికి వెళ్లి మందులు ఇచ్చి, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దుమ్ముగూడెం : మండలంలోని సీతారాంపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ కేశవరావు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ ఘటనలో పోలీసులను చూసి పారిపోతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 2460, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



దీక్షలో పాల్గొన్న బీజేపీ జిల్లా నాయకులు

చుంచుపల్లి: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నిర్మించిన ఇళ్లను సైతం పేదలకు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో అమలు కాని వాగ్దానాలు చేస్తూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా కిరణ్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎడ్లపల్లి శ్రీనివాస్, సీతారాం నాయక్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు జోగు ప్రదీప్, దివ్యశ్రీ, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, గోపి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రి ఆలయ తోరణం పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న చైర్మన్

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలకలో నీలాద్రి ఆలయానికి వెళ్లే దారిలో స్వాగత తోరణం నిర్మించనున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగతంగా అందజేసిన రూ.21 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు సోమవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావుతో పాటు భుక్యా ప్రసాద్, రుద్రజారాణి, పాకల వెంకటరమణ, చెక్కిలాల లక్ష్మణరావు, ముక్కర భూపాల్‌రెడ్డి, చింతనిప్పు సత్యనారాయణ, వంగా నిరంజన్, యడ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ సీసాలో పురుగులు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు



పురుగులు ఉన్న కూల్‌డ్రింక్ సీసా

సుజాతనగర్: ఓ వ్యక్తి కొనుగోలు చేసిన కూల్‌డ్రింక్ సీసాలో పురుగులు కనిపించిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని స్టేషన్ బేతంపూడి గ్రామానికి చెందిన బానోత్ చంద్రు అదే గ్రామంలోని కిరాణా షాపులో ఈనెల 2న 10 కూల్‌డ్రింక్ సీసాలు కొనుగోలు చేశాడు. ముగ్గురు కుటుంబసభ్యులు మూడు సీసాల్లోని శీతల పానీయం తాగగా వారికి వాంతులు అయ్యాయి. మిగిలిన సీసాలను గమనించగా మరో సీసాలో కూడా పురుగులు కనిపించడంతో ఖంగుతిన్నారు. సీసాలో పురుగులు ఉన్నాయని దుకాణ యజమానిని అడగగా అతడు డీలర్ వివరాలు ఇచ్చాడు. దీంతో పాత కొత్తగూడెంలోని గోడౌన్ వద్దకు సదరు సీసాను పట్టుకెళ్లి ఈ విషయాన్ని డీలర్‌కు చెప్పగా.. అతడు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించాడు. సోమవారం సుజాతనగర్‌లో సదరు వాహనాన్ని గుర్తించి అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విశ్వనరుడు గుర్రం జాషువా



సమావేశంలో మాట్లాడుతున్న బన్న అయిలయ్య

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు సాహిత్యంలో విశ్వ నరుడుగా గుర్రం జాషువా పేరుగాంచారని కేయూ తెలుగు శాఖాధ్యక్షుడు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య పేర్కొన్నారు. ఖమ్మంలో సోమవారం జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యాన జాషువా వర్ధంతి సభ ఏర్పాటుచేశారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, కార్యదర్శి పగడిపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో అయిలయ్య మాట్లాడుతూ జాషువా రచనల నిండా సగటు మనిషి ఎదుర్కొన్న కుల అసమానతలు, అవమానాలు ఉన్నాయని తెలిపారు. ఆయన జీవితమే సాహిత్యంగా అనేక కావ్యాల రూపంలో వెలువడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో నయీం, ఎం.సురేష్, కె.బ్రహ్మం, జి.వీరభద్రం, మనోరమ, రవిమారుత్, టి.రాధ పాల్గొన్నారు.



ఖమ్మంలో సోమవారం ఉదయం నుంచి జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. ఈ సమయంలో అత్యవసర పనులు ఉన్న వారే బయటకు వచ్చారు. కానీ స్టేడియం ప్రహరీ వెంట ఓ మహిళ మాత్రం బోడ కాకరకాయలు అమ్ముతూ కనిపించింది. ఇలాగే పలువురు చిరువ్యాపారులు వర్షంలోనే అమ్మకాలు సాగించగా.. కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయని వాపోయారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



సూరయ్య మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధి కుంజవారిగుంపులో సోమవారం విద్యుదాఘాతానికి గురైన కౌలు రైతు కల్తి సూరయ్య(65) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూడు దశాబ్దాల క్రితం కోరగుట్ట సమీపాన సూరయ్య ఐదు ఎకరాలు పోడు నరుక్కొని సాగు చేసుకుంటున్నాడు. అయితే, అటవీశాఖ అధికారులు అర్బన్ పార్క్ నిర్మాణానికి భూమి స్వాధీనం చేసుకోవడంతో మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఈ మేరకు సోమవారం ఉదయం చేనులో అరక దున్నిన ఆయన, బావి వద్ద మోటార్ విద్యుత్ తీగలు సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, సర్పంచ్ కల్తి పద్మ తదితరులు సూరయ్య కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, విద్యుత్ శాఖ ఏఈ రాము, ఆర్ఐ పద్మ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. సూరయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా... పిల్లల చిన్నయస్సులోనే ఆయన భార్య పిడుగుపాటుతో మృతి చెందగా సూరయ్యే తల్లీతండ్రి అయి పిల్లలను పెంచి పెద్దచేశాడు.

గుర్తు తెలియని వ్యక్తి...



గుర్తుతెలియని మృతదేహం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్ బస్తీలో సమీపాన గత ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి(70) అపస్మారక స్థితిలో ఉండగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సదరు వ్యక్తి సోమవారం మరణించాడు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 87126 82017 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు.

అనుమానాస్పదస్థితిలో యువతి...

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండాకు చెందిన సింధు (23) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న సింధు ఇల్లెందు ఆస్పత్రిలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందుతోంది. ఈ క్రమంలో సోమవారం ఆమె తలకు బలమైన గాయమైందని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సింధు మృతిచెందింది. అయితే సింధు కింద పడటం వల్ల తలకు గాయమైందా లేక ఎవరైనా కొట్టారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మృతురాలి ఆచూకీ లభ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రశాంతినగర్ వద్ద సాగర్ కాల్వలో ఆదివారం ఓ యువతి మృతదేహం లభించగా ఆమె ఆచూకీ సోమవారం వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రశాంతినగర్‌కు చెందిన గోకినపల్లి సమీర(18) తండ్రి పదేళ్ల క్రితం చనిపోవడంతో తల్లి సుభద్ర ఇద్దరు కుమార్తెలతో ఉంటూ కూలీ పనులకు వెళ్తోంది. పదో తరగతి పూర్తిచేసిన సమీర ఇంట్లో ఖాళీగా ఉండడంతో ఏదైనా పనికి వెళ్తే కుటుంబపోషణకు అండగా ఉంటుందని ఆదివారం మందలించిన తల్లి ఆతర్వాత బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ కాసేపటికే బయటకు వచ్చిన సమీర సాగర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు పత్రికల్లో ఫొటోలు రావడంతో గుర్తించిన సుభద్ర పోలీసులను సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంటోన్మెంట్ల ఏరియాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: కంటోన్మెంట్ల సివిల్ ఏరియాలను సంబంధిత మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ తెలిపారు. కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలు, దానికి అనుకుని ఉన్న రాష్ట్ర మున్సిపల్ ప్రాంతాలను నియంత్రించే పురపాలక చట్టాలలో ఏకరూపకతను తీసుకురావడానికి కొన్ని కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలను తొలగించాలన్నారు. దీంతో వాటిని పొరుగు మున్సిపాలిటీలతో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రకారం విధివిధానాలపై అభిప్రాయాలను తెలిపేందుకు ప్రతిపాదనలను రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు.

'మార్గదర్శి' డిపాజిట్‌దారుల సొమ్ము ఏమైంది?

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ డిపాజిట్‌దారుల సొమ్ముకు సంబంధించి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏం జరిగిందో చూడాల్సి ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి సొమ్ము తరలించడం సాధారణమేనని, అదే విధంగా ఈ కేసులోనూ జరిగిందని చెబుతున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సొమ్ము ఏమైందోనన్న అంశంపై ఆలోచిస్తున్నామని పేర్కొంది. మార్గదర్శి కేసుల న్యాయపరిధిపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

రాక్షసులపై విజయం

- పేదల కోసం మూడేళ్లుగా పెత్తందారులతో మీ బిడ్డ పోరాటం: ఏపీ సీఎం జగన్
- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం
- ఇకపై అమరావతి మనందరిది.. 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా

"పేద వర్గాలపై పెత్తందారుల దోపిడీలను సహించి భరించే కాలం పోయింది. ఈ మార్పు ఇక మీదట రాజకీయాలను శాసిస్తుంది. అలాంటి మార్పులకు మనసా వాచా కర్మణా సహకరించే ప్రభుత్వంగా, మీ అన్నగా.. నిరుపేద అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మనందరిది.
– సీఎం జగన్


గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదలకు మేలు జరిగే ప్రతి విషయంలో మనందరి ప్రభుత్వానికి, చంద్రబాబు పెత్తందారుల కూటమికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మంచి జరగకూడదని రాక్షస బుద్ధితో అడ్డుకుంటున్న వారితో పెద్ద యుద్ధమే చేస్తున్నామన్నారు. సోమవారం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 50,793 ఇళ్ల నిర్మాణం, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం జగన్ మాట్లాడారు. తొలుత తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్దకు చేరుకున్న సీఎం జగన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ తర్వాత కూడా బుద్ధి మారలేదు..

సీఆర్‌డీఏలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సృష్టించిన ఊరుపేరూ సంఘాలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ – 5 అడ్డు తగిలాయి. వీరంతా మొదట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీల్లేదన్నారు. ఇందుకోసం ఏకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లిన దౌర్భాగ్యమైన పరిస్థితిని మన రాష్ట్రంలో మాత్రమే చూస్తున్నాం. ఈ పెద్దమనుషులు, పెత్తందార్లు, పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీం కోర్టులో 5 కేసులు వేశారు. ఈ కేసులను పరిష్కరించేందుకు మీ తరఫున మీ బిడ్డ మూడేళ్ల పాటు పోరాటం చేస్తూ వచ్చాడు. దేవుడు, ప్రజల చల్లని ఆశీస్సులు ఎప్పుడూ మంచికే ఉంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే కేసులు గెలిచింది. అనుమతులు తెచ్చుకుని మీకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆ తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి అడ్డు తగిలేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు. కలవని కేంద్ర మంత్రీ, కేంద్ర సెక్రటరీలు కూడా లేరు. ఇంతమందిని కలిశాక చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎక్కడా ఉండదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి బీజేపీ మహాధర్నా వాయిదా

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని బీజేపీ వాయిదా వేసింది. రాబోయే మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదన్న ఉద్దేశంతో మహాధర్నాను వాయిదా వేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాధర్నాను నిర్వహించబోయే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

శాంతిభద్రతలను కాపాడలేకపోతే ఎలా?

- మాట్లాడే హక్కును ఎవరూ అడ్డుకోలేరు
- పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం
- బీజేపీ ధర్నాకు గ్రీన్‌సిగ్నల్



సాక్షి, హైదరాబాద్: అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించనున్న ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీలకు ఆదేశాలు జారీ చేసింది. ధర్నాలో 500 మంది మాత్రమే పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆ వివరాలను సోమవారం సాయంత్రం 6 గంటల కల్లా అధికారులకు సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతించకుంటే మరి ఎక్కడ చేయాలి?.. మాట్లాడటం అనేది ప్రజల ప్రాథమిక హక్కు, దానిని ప్రభుత్వం అడ్డుకోలేదని తేల్చిచెప్పింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడలేకపోతే ధర్నాకు హాజరయ్యే ప్రజలకు పాస్‌లు జారీ చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆదేశించింది. 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ధర్నాకు శాంతిభద్రతల పేరుతో పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్‌కుమార్ సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ధర్నాలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు. దాదాపు 1000 మంది హాజరయ్యే ఈ ధర్నాకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇళ్లు ఇవ్వడం లేదని, నిర్మాణంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని.. అందుకే బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాగా, వెయ్యి మందితో ధర్నా నిర్వహిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హోం శాఖ జీపీ రూపేందర్ చెప్పారు. ఇందిరాపార్కు వద్ద కొద్ది రోజుల క్రితం స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని.. అది ఇంకా ప్రారంభం కూడా కాలేదని, ధర్నాకు అనుమతి ఇస్తే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ధర్నాకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'సోమేశ్ తీర్పు'నే వర్తింపజేయాలి

కేడర్ వివాదంపై హైకోర్టులో కేంద్రం వాదనలు • మా వాదనలు కూడా వినాలన్న పిటిషనర్లు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది జనవరి 10న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలనే డీజీపీ అంజనీకుమార్ సహా 12 మంది ఆలిండియా సర్వీస్ అధికారులకు వర్తింపజేయాలని కేంద్రం వాదనలు వినిపించింది. 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. అయితే సోమేశ్ కుమార్‌తో కేడర్‌కు సంబంధించిన అంశాల్లో పలు వ్యత్యాసాలు ఉన్నాయని, తమ వాదనలు కూడా వినాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. సోమేశ్‌కుమార్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. రివ్యూ పిటిషన్‌లో తుది ఉత్తర్వులు వచ్చే వరకు 13 మంది పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ ఓ పరిశీలన నివేదికను కోర్టుకు అందజేశారు. దీని ప్రకారం అంజనీకుమార్, రొనాల్డ్ రాస్, జె.అనంత రాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి కాటా, అభిలాషా బిస్త్ కేసులు సోమేశ్‌కుమార్ కేసు విశ్లేషణతో సరిపోతాయని, వారికి జనవరి తీర్పును వర్తింపజేయాలని డీఎస్‌జీ కోరారు. మిగతా వాటిపై విడిగా విచారణ చేపట్టవచ్చని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసుల పరిశీలనకు సమయం పడుతుందంటూ, విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది.

హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా బొర్రహేమ్యా తండాలో ఘటన

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక ఓ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కుల్కచర్ల మండలం బొర్ర హేమ్యాతండాకు చెందిన హీరమన్, శాంతిబాయి దంపతుల కుమారుడు వినోద్(15) స్థానిక పాఠశాలలో ఇటీవల ఏడో తరగతి పూర్తిచేశాడు. కొద్దిరోజుల క్రితం తల్లిదండ్రులు అతన్ని పటాన్‌చెరులోని గిరిజన ఆశ్రమపాఠశాలలో చేర్పించారు. అక్కడ ఉండటం ఇష్టంలేని బాలుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. సెలవులున్నాయని ఇటీవల ఇంటికి వచ్చిన అతన్ని తిరిగి హాస్టల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినోద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గోదారికి పోలవరం అడ్డంకి

- పోలవరం అథారిటీకి స్పష్టం చేసిన తెలంగాణ
- ఆ ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది
- అందుకే గతేడాది రాష్ట్రంలో ముంపు ప్రభావం
- ప్రాజెక్టు గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచాలని లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నాటి పరిస్థితులతో పోల్చితే ప్రాజెక్టు నిర్మించిన తర్వాత తెలంగాణ భూభాగం పరిధిలో గోదావరి నది స్వేచ్ఛా ప్రవాహాన్ని కోల్పోయిందని, పోలవరం అడ్డంకిగా మారిందని తెలంగాణ రాష్ట్రం మళ్లీ ఆందోళన వ్యక్తం చేసింది. దీని ప్రభావం భద్రాచలం వద్ద గోదావరిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణ భూభాగంలో ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జల సంఘానికి మరో సారి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ నెల 21న లేఖ రాశారు. పోలవరం 48 గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది గోదావరికి వచ్చిన వరదలతో తెలంగాణలోని భద్రాచలం, పరిసర గ్రామాల పరిధిలోని 28వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తికావడమే దీనికి కారణమన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను నిర్ధారించేందుకు జాయింట్ సర్వేను నిర్వహించాలని మరోసారి పీపీఏను కోరారు.

జిల్లా వార్తలు


ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా ఎన్నికలకు ముందే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వచ్చే నెల రెండో వారం హైదరాబాద్‌లో జరగనున్న విశ్వరూప సభ విజయవంతానికి సోమవారం ఇల్లెందులో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ గత పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే వర్గీకరణ విషయంలో నష్టం జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే అన్నిరకాలుగా లాభం ఉంటుందని, 20 వేల ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. కాగా, అధికారంలోకి వచ్చేందుకు మాదిగలను కేసీఆర్ అణగదొక్కగా, పార్లమెంట్‌లో మాట్లాడని రేవంత్‌రెడ్డి తెలంగాణలో మాత్రం వర్గీకరణ కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, వంగూరి ఆనందరావు, కె.వెంకటేశ్వరరావు, మెంతెన వసంతరావు, జినక ఇస్తారి, సోమయ్య, కాంపాటి పృథ్వీ, నాగమణి, సుభద్ర, పి.ప్రభాకర్, ఎం.ప్రభాకర్, చింతల మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎన్‌ఎండీసీ క్రికెట్ టోర్నీలో సింగరేణి జైత్రయాత్ర


సింగరేణి క్రికెట్ జట్టు

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లో జరుగుతున్న ఎన్‌ఎండీసీ క్రికెట్ టోర్నీలో సింగరేణి జట్టు సత్తా చాటుతోంది. ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థల తరఫున జట్లుపాల్గొంటుండగా, ఈనెల 16, 23వ తేదీల్లో జరిగిన మ్యాచ్‌ల్లో సింగరేణి జట్టు గెలుపొందింది. దీంతో గ్రూప్–ఏలో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఇంకో లీగ్ మ్యాచ్ ఉండగానే సెమీస్‌లోకి ప్రవేశించింది. కాగా, సింగరేణి జట్టు విజయాల్లో కెప్టెన్ శశికాంత్‌తో పాటు క్రీడాకారులు శర్వంత్, జగదీష్, హరికిషన్, చిరంజీవి తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

జీవన ఎరువు.. కరువు !

- తెగుళ్లను సమగ్రంగా నివారించే ఎరువుల కొరత
- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారీ
- డిమాండ్‌కు అనుగుణంగా లేని ఉత్పత్తి
- ప్రయోగశాల ఎదుట నోస్టాక్ బోర్డులు.. ప్రదక్షిణలు చేస్తున్న రైతులు


ఎరువు వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పంటల్లో తెగుళ్లను సమగ్రంగా నివారించగలిగే జీవన ఎరువులకు కొరత ఏర్పడింది. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ఈ ఎరువులకు డిమాండ్ పెరిగింది. సాగుకు ఎంతో ప్రయోజనకరమైన జీవన ఎరువులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసే పంటల దృష్ట్యా ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో వ్యవసాయ శాఖ 2011లో ఏర్పాటు చేసిన జీవ నియంత్రణ ప్రయోగశాలలో ఈ ఎరువులను తయారు చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు వేగవంతం కావటంతో రైతులు జీవ ఎరువుల కొనుగోళ్లకు ప్రయోగశాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల తయారీ లేకపోవడంతో నిర్వాహకులు నో స్టాక్ బోర్డు పెట్టారు. దీంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

రెండు రకాలుగా తయారీ..

ఖమ్మంలోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్ ఎరువులను తయారు చేస్తున్నారు. ప్రతి ఏటా రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ 10 టన్నుల తయారీకి అనుమతి ఇస్తూ, ఎరువుల తయారీకి అవసరమైన అన్ని రకాల కెమికల్స్ అందజేస్తోంది. ప్రయోగశాల నిర్వాహకులు విడతల వారీగా ఈ రెండు రకాల ఎరువులను తయారు చేస్తారు. సైకిల్ విధానంలో ఒక ఎరువు తయారీకి 15 రోజుల వ్యవధి పడుతుంది. ఒక్కో విడతలో ఒక్కో ఎరువును 250 కిలోల చొప్పున మొత్తం 500 కిలోలు తయారు చేస్తున్నారు.

డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేదు..

ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్ ఎరువుల వినియోగానికి తగిన విధంగా ఉత్పత్తి లేకపోవడంతో కొరత సమస్య తలెత్తుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని రకాల పంటలకు రైతులు వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మిర్చి సాగులో తెగుళ్లను ఈ ఎరువులు నివారిస్తుండడంతో రైతులు వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్కో జీవన ఎరువును ఎకరాకు 4 కిలోల చొప్పున వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 11 లక్షల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో మిర్చి దాదాపు 1.30 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. జీవ నియంత్రణ ప్రయోగశాల తయారు చేసి విక్రయించే ఎరువులు 5 వేల ఎకరాలకు మించి సరిపోదు. దీంతో సమస్య ఎదురవుతోంది. ఎరువుల దుకాణాల్లో వివిధ కంపెనీలకు చెందిన ఈ జీవన ఎరువుల లభ్యత ఉన్నప్పటికీ రైతులు వ్యవసాయ శాఖ తయారు చేసే ఎరువులపైనే నమ్మకం పెట్టుకుని కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయ శాఖ ప్రయోగశాలలో ట్రైకోడెర్మా విరిడీ కిలో ప్యాకెట్ ధర రూ.100 కాగా, సూడోమోనాస్ కిలో ప్యాకెట్ ధర రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ప్యాకెట్ల వినియోగ కాలం 6 నెలలు మాత్రమే ఉంటుంది.


ప్రయోగశాలలో జీవన ఎరువు తయారుచేస్తున్న ఉద్యోగులు

ప్రయోజనాలతోనే డిమాండ్..

జీవన ఎరువులతో ప్రయోజనాలు పుష్కలంగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. విత్తన శుద్ధి మొదలు, భూమిలో పోషకాలను సమతుల్యం చేయటం, తెగుళ్లను సమగ్రంగా నియంత్రించటం కోసం ఈ ఎరువులు వినియోగిస్తారు. ట్రైకోడెర్మా విరిడీని విత్తన శుద్ధి, మిరపలో నారు, వేరుకుళ్లు నివారణకు, కంది, పత్తిలో కూడా వేరుకుళ్లకు, అల్లం, పసుపుల్లో దుంపకుళ్లకు, వేరుశనగలో కాయకుళ్లు, వేరుకుళ్లు నియంత్రణకు వినియోగిస్తారు. నేల ద్వారా వ్యాపించే శిలీంద్రాల నిర్మూలనకు వాడుతారు. సూడోమోనాస్‌ను ఒక బ్యాక్టీరియాతో తయారు చేస్తారు. ఈ ఎరువును వరి నాటే సమయంలో కాండంకుళ్లు నివారణకు వినియోగిస్తారు. వరిలో ఆకుఎండు తెగులు, పాముపొడ వంటి తెగుళ్లను సమగ్రంగా నివారిస్తుంది. మిరపలో తెగుళ్లను కూడా సేంద్రియ ఎరువులతో కలిపి వినియోగిస్తే వివిధ రకాల తెగుళ్లు నియంత్రించవచ్చు.

ఎరువులు లభించటం లేదు



ఖమ్మంలోని గట్టయ్య సెంటర్‌లో జీవ నియంత్రణ ప్రయోగశాలలో తయారు చేస్తున్న ఎరువులు లభించటం లేదు. ఎప్పుడు వెళ్లినా నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. అన్ని రకాల పంటల సాగులో జీవన ఎరువులను వినియోగిస్తాం.
– దేవరం వెంకటరెడ్డి, ఏలువారిగూడెం, తిరుమలాయపాలెం మండలం

వాడమంటారు.. ఇవ్వరు



జీవ నియంత్రణ ఎరువులు ఎంతో మేలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో కొన్ని సంవత్సరాలుగా వాడుతున్నాం. ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కొరత ఏర్పడింది. రైతులకు సరిపడా ఎరువులు ఉత్పత్తి చేసి అందుబాటులో ఉంచాలి.
– కాంపాటి శ్రీనివాసరావు, ఎద్దుల్ల చెరువు, తిరుమలాయపాలెం మండలం

సామర్థ్యం మేరకు తయారీ..



జీవన ఎరువులకు ప్రాధాన్యత పెరిగింది. రైతుల డిమాండ్‌కు తగినంతగా ప్రయోగశాలలో తయారు చేయలేం. సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేస్తున్నాం. రైతులు జీవన ఎరువుల కోసం ప్రయోగశాలకు వచ్చి వెళుతున్నారు. వివిధ పంటల్లో ఈ ఎరువుల వినియోగం పెరిగింది.
– వాణిశ్రీ, ఏడీఏ, జీవనియంత్రణ ప్రయోగశాల, ఖమ్మం

వారసులకు కారుణ్య నియామక పత్రాలు


నియామక పత్రాలు అందుకున్న వారితో జీఎం, తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వర్తించి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారి సోమవారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు 516 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అధికారులు జీ.వీ.కోటిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, సుధాకర్, మురళి, ఎం.వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్‌తో పాటు ఎం.డీ.రజాక్ పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాట్లు పరిశీలన

కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈనెల 25న సింగరేణి ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రత సమావేశం జరగనుంది. ఈమేరకు ఏర్పాట్లను సోమవారం జీఎం శాలేం రాజు పరిశీలించి సూచనలు చేశారు. అధికారులు, ఉద్యోగులు కోటిరెడ్డి, సీహెచ్.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, పాలడుగు శ్రీనివాస్, రమణారెడ్డి, అనిల్, దేవదాసు, తావుర్యానాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజనులకు అవగాహన కల్పించడంతో పాటు వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్ అధికారులకు అందచేశారు. అనంతరం అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ గోదావరి వరదలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈమేరకు గిరిజనులు, ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అలాగే, అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్), ఇన్‌చార్జ్ డీడీ, గురుకులం ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, అధికారులు తానాజీ, విజయ్‌కుమార్, భీమ్, భాస్కర్, సురేష్‌బాబు, అశోక్‌కుమార్, మునీర్ పాషా, రమణయ్య, ఆదినారాయణ, శ్రీనివాస్, నర్సింహారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర పేదలకూ పోడు పత్రాలు ఇవ్వాలి

ప్రజాపంథా రాష్ట్ర నాయకులు గుమ్మడి, రాయల


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులతో పాటు గిరినేతరులకు కూడా గిరిజన చట్టాలకు లోబడి హక్కు పత్రాలు ఇవ్వాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గుండాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 11లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, నాలుగున్నర లక్షల ఎకరాలకే ఇచ్చిన ప్రభుత్వం చేతులు దులుపుకుతోందని ఆరోపించారు. ఈమేరకు పూర్వ కాలం నుంచి పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇచ్చి సాగుదారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాగా, గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఇటీవల కొందరు తనను గిరిజన చట్టాలకు వ్యతిరేకిగా చేస్తున్న ప్రచారంలో ప్రచారం వాస్తవం లేదని చెప్పారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులకు పట్టాలు ఇవ్వాలని తాను కోరితే చట్టాలనే రద్దు చేయాలని అన్నట్లు పేర్కొనడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయిని రాజు, కొమరం శాంతయ్య, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, వాంకుడోత్ అజయ్, కుమార్, తెల్లం రాజు, ఈసం కృష్ణ, జగన్, రామన్న, పాల్గొన్నారు.